ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
శుక్రవారం, 19 ఏప్రిల్ 2024
5






	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	42	28
భద్రాద్రి	44.5	27



స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన అనంతరం మొక్కుతున్న గవర్నర్ రాధాకృష్ణన్



స్వామివారి పల్లకీ మోస్తున్న ఉన్నతాధికారులు



దేవతలు ఎంతమంది ఉన్నా.. అందరూ కల్యాణానికే పరిమితం.. ఎవరికీ లేని అరుదైన విశిష్టత, రాజ్యపట్టాభిషేక ఘనత భద్రాద్రి రామయ్యకే సొంతం. పట్టాభిషేక విశిష్టత లోకపాలనకు స్ఫూర్తిగా, సర్వజనానికి శ్రీరామరక్షగా నిలుస్తోంది. సమాజానికి ఆదర్శప్రాయుడుగా వెలసిన శ్రీసీతారామచంద్రస్వామికి భద్రాచలంలో గురువారం మహాపట్టాభిషేక వేడుక అత్యంత వైభవంగా నిర్వహించారు. రాజలాంఛనాలతో నిర్వహించిన ఈ క్రతువును తిలకించిన భక్తకోటి పరవశించింది. ఈ మహత్తర కార్యక్రమంలో శ్రీరాముడికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ పట్టువస్త్రాలు సమర్పించారు.

- భద్రాచలం

జయహో.. రామచంద్రా!

రాజలాంఛనాలతో భద్రాద్రి రామయ్యకు మహా పట్టాభిషేకం

7

స్వామికి అలంకరించే ఖడ్గాన్ని చూపుతున్న అర్చకుడు

లోక్‌సభ ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్చి 16న షెడ్యూల్ ప్రకటించింది. ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ వీపీ గౌతమ్ గురువారం ఉదయం 11గంటలకు లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేసి ప్రకటించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొత్తం 7 సెగ్మెంట్లతో పార్లమెంట్ ఎన్నికలను నిర్వహించనున్నారు. నోటిఫికేషన్ విడుదలైన గురువారం నాటినుంచే నామినేషన్ల స్వీకరణ ప్రారంభించారు. ఈనెల 25వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. 26న వచ్చిన నామినేషన్లను పరిశీలిస్తారు. 27 నుంచి 29వరకు ఉపసంహరణకు గడువు ఉంది. ఆ తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను ప్రకటిస్తారు. మే 13న పోలింగ్. జూన్ 4న ఓట్ల లెక్కింపు ఉంటుంది.

- 25వరకు నామినేషన్ల స్వీకరణ
- 26న పరిశీలన
- 29 వరకు ఉపసంహరణ గడువు
- మే 13న పోలింగ్
- జూన్ 4న ఫలితాలు



ఎలక్షన్ వార్ షురూ

లోక్‌సభ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 18: నామినేషన్ల గడువు అనంతరం అభ్యర్థులను ప్రకటించిన తర్వాత ప్రచారానికి గడువు పోలింగ్‌కు 48 గంటల ముందు వరకు ఉంటుంది. ఇప్పటికే పార్లమెంట్ పరిధిలో ఎన్నికలకు అధికార యంత్రాంగం సన్నద్ధం చేశారు. పోలింగ్ సిబ్బంది నియామకం, వారికి శిక్షణ, ఈవీఎంల కమిషనింగ్ పూర్తి చేసి సిద్ధం చేశారు. ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ పూర్తి చేశారు. మే 13న పోలింగ్ తర్వాత ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి ఈవీఎంలను పాలేరు నియోజకవర్గం ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు సమీపంలోని చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్ రూం తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. అక్కడే విడివిడిగా అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను వెల్లడించనున్నారు. ఎన్నికల నేపథ్యంలో కోడ్ ఉల్లంఘించకుండా అన్ని చర్యలు చేపట్టారు. అంతరాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. సరిహద్దులలో వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. ఇప్పటికే సర్వేలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సర్వేలెన్స్, తనిఖీ అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు.

నామినేషన్ల స్వీకరణ

ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీపీ గౌతమ్ కలెక్టరేట్ చాంబర్‌లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఉన్నారు. తొలిరోజున ఒక అభ్యర్థి నామినేషన్ దాఖలు చేశారు. ఆధార్ పార్టీ తరపున కుక్కల నాగయ్య తన ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ల కోసం ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు. అక్కడ డీఆర్వో స్థాయి అధికారితోపాటు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా ఖమ్మం మునిసిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి వ్యవహరిస్తున్నారు. నామినేషన్ దాఖలు చేయడానికి వచ్చేవారికి అన్ని సౌకర్యాలు, సదుపాయాలను కల్పించారు. నామినేషన్ల కార్యక్రమం సందర్భంగా కలెక్టరేట్‌లో నిబంధనలను కఠినంగా అమలుచేస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి ఉద్యోగులను తప్ప ఎవరినీ అనుమతించలేదు. పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. 100 మీటర్లకు దూరంగానే వాహనాలను నిలిపివేస్తున్నారు. ధర్నాచౌక్ వద్దనే మీడియా పాయింట్‌ను ఏర్పాటు చేశారు. అక్కడే రాజకీయపార్టీల నాయకులు నామినేషన్ వేయడానికి వచ్చిన వ్యక్తులకు మీడియాతో మాట్లాడేందుకు అనుమతిస్తున్నారు. కలెక్టరేట్‌లో 144సెక్షన్‌ను అమలు చేస్తున్న నేపథ్యంలో మీడియా ప్రతినిధులను కూడా లోనికి అనుమతించలేదు.

మోగిన ప్రచారభేరి

ఎన్నికల ప్రచారానికి తరలిరానున్న అతిరథులు

- నేడు మానుకోటలో సీఎం రేవంత్‌రెడ్డి జనజాతర సభ
- ఖమ్మంలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ రోడ్ షో
- త్వరలో జిల్లాకు కేసీఆర్ బస్సుయాత్ర
- వేడెక్కుతున్న ఎన్నికల రాజకీయం

6



లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ గురువారం విడుదల కావడంతో ప్రధాన పార్టీలు సమరానికి సై అంటున్నాయి. నామినేషన్ల ఘట్టం తర్వాత పట్టుమని 20 రోజులు కూడా సమయం లేకపోవడంతో ప్రచారంతో హోరెత్తించేందుకు జాతీయ, ప్రాంతీయ పార్టీల అగ్రనేతలు సిద్ధమవుతున్నారు. వాడివేడి వాగ్బాణాలతో జనాన్ని ఆకట్టుకునేందుకు రంగంలోకి దిగుతున్నారు. శుక్రవారం బీజేపీ జాతీయనేత, కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఖమ్మంలో, సీఎం రేవంత్‌రెడ్డి మహబూబాబాద్‌లో ప్రచారం నిర్వహించనున్నారు. బీఆర్‌ఎస్ చీఫ్ కేసీఆర్ కూడా త్వరలో రానున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం

నిప్పులు కురిపిస్తున్న ఎండలు



- పెనుబల్లిలో అత్యధికంగా 44.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- పలు మండలాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించిన అధికారులు
- ప్రజలు బయటికి రావొద్దని హెచ్చరిక
- కోల్‌బెల్ట్ ప్రాంతంలో అల్లాడిపోతున్న జనం
- అశ్వాపురంలో 44.7 డిగ్రీలు..

6



కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు

ఎన్నికల వ్యయ పరిశీలకుల రాక

స్వాగతం పలికిన రిటర్నింగ్ అధికారి గౌతమ్

6



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి వినోద్‌రావు

'కమలం'లో కదనోత్సాహం

- నేడు బీజేపీ జాతీయ నేత, కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ రాక
- తాండ్ర వినోద్‌రావు నామినేషన్ సందర్భంగా ర్యాలీ, రోడ్‌షో
- పాల్గొననున్న పలువురు అగ్ర నాయకులు
- ఉమ్మడి జిల్లా నుంచి తరలిరానున్న పార్టీ శ్రేణులు
- ఖమ్మంలో 'కమల' వికాసం ఖాయం : బీజేపీ నేతల ధీమా

6



బీ-ఫామ్ అందుకున్న నామా

గెలుపు కోసం శ్రమించాలి : కేసీఆర్

ఖమ్మం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ ముఖ్యనేతలతో పార్టీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఖమ్మం లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావుకు పార్టీ బీ ఫామ్‌తో పాటు రూ.95లక్షల చెక్కును అందించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ గెలిచేందుకు అందరు శ్రమించాలని, కాంగ్రెస్ ప్రభుత్వ విధానాల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఎన్నికలకు సంబంధించి దశ, దిశ నిర్దేశించారు. నామా నాగేశ్వరరావు విజయానికి కృషిచేస్తామని జిల్లా నేతలు తెలిపారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ జిల్లా పార్టీ అధ్యక్షుడు తాతా మధుసూదన్, జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్య, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండాల కృష్ణ, బొమ్మెర రామ్మూర్తి తదితరులున్నారు.

లంచగొండుల ఆటకట్టు

- వల పన్ని పట్టుకున్న ఏసీబీ
- భద్రాచలం ఎస్‌ఐ శ్రీనివాస్ సహా ముగ్గురు..
- పాల్వంచ టౌన్‌ప్లానింగ్ అధికారి వెంకటరమణి సహా ఇద్దరు..
- వేర్వేరు చోట్ల ఏసీబీ అధికారుల ఆపరేషన్
- లంచాలు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత
- నిందితుల అరెస్టు... ఏసీబీ కోర్టుకు తరలింపు



ఏసీబీకి పట్టుబడ్డ ఎస్‌ఐ, కానిస్టేబుల్, సీసీ టెక్నీషియన్



పట్టుబడిన టౌన్ ప్లానింగ్ అధికారి వెంకటరమణి, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ప్రసన్న కుమార్

భద్రాచలం/పాల్వంచ, ఏప్రిల్ 18: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గురువారం ఏసీబీ దాడుల్లో ఓ ఎస్‌ఐ పలువురు పట్టుబడ్డారు. ఓ చోరీ కేసులో లంచం తీసుకుంటూ భద్రాచలం ఎస్‌ఐ శ్రీనివాస్‌తో పాటు, కానిస్టేబుల్ శంకర్, ఓ ప్రైవేటు సీసీ టెక్నీషియన్ పట్టుబడ్డారు. మరో ఘటనలో ఎల్‌ఆర్‌ఎస్ అప్రూవల్ కోసం లంచం తీసుకుంటూ పాల్వంచ మునిసిపాలిటీ టౌన్‌ప్లానింగ్ అధికారితో పాటు ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి పట్టుబడ్డారు.

చోరీ కేసులో లంచం తీసుకుంటూ...

ఓ దొంగతనం కేసులో నిందితులనుంచి లంచం తీసుకుంటూ భద్రాచలం ఎస్‌ఐ శ్రీనివాస్, ఓ కానిస్టేబుల్‌తో పాటు మరో ప్రైవేటు వ్యక్తితో కలిసి ఏసీబీకి పట్టుబడ్డారు. ఏసీబీ వరంగల్ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాచలంలో ఈనెల 12న పాతమార్కెట్ గోడౌన్‌లో మర్రి సాయితేజ, మరో ఇద్దరు మిత్రులతో కలిసి నాలుగు చక్కెర బ్యాగులను దొంగతనం చేశారు. ఈ విషయాన్ని స్టేషన్‌లో డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ శంకర్ గోదాంలోని సీసీ కెమెరాల్లో గమనించి బ్లూ కోర్ట్స్ సిబ్బంది,ఎస్‌ఐ ములగుండ్ల శ్రీనివాస్‌కు సమాచారం అందించాడు. దీంతో చోరీకి పాల్పడిన ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని చక్కెర బ్యాగులు, వారి వద్ద ఉన్న ఫోన్లు, ఆటోను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం కానిస్టేబుల్ శంకర్ పట్టుబడిన

మిగతా 6వ పేజీలో...

బీఆర్ఎస్‌కు అగ్నిపరీక్ష

గత లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లో గులాబీ వికసించింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో దెబ్బతిన్నప్పటికి 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం నుంచి నామా నాగేశ్వరరావు, మహబూబాబాద్ నుంచి మాలోతు కవిత విజయం సాధించారు. అయితే గత నవంబరు 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 9 అసెంబ్లీ స్థానాల్లో బీఆర్ఎస్ ఘోర పరాజయం చూసింది. కాంగ్రెస్ కూటమి ఘన విజయం సాధించింది. గతంలో ఎన్నడు లేని మెజారిటీలు సాధించింది.

● ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం

- లోక్‌సభ ఎన్నికల్లో ఎదురీదుతున్న అభ్యర్థులు
- ఖమ్మంలో నామా, మానుకోటలో కవిత ప్రచారం
- ఉమ్మడి జిల్లాలో అన్ని చోట్లా కాంగ్రెస్‌దే ఆధిపత్యం
- గత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పట్టం కట్టిన ఓటర్లు
- అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న సిట్టింగ్ ఎంపీ నామా నాగేశ్వరరావు



గత లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లో గులాబీ వికసించింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో దెబ్బతిన్నప్పటికీ 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం నుంచి నామా నాగేశ్వరరావు, మహబూబాబాద్ నుంచి మాలోతు కవిత విజయం సాధించారు. అయితే గత నవంబరు 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 9 అసెంబ్లీ స్థానాల్లో బీఆర్ఎస్ ఘోర పరాజయం చూసింది. కాంగ్రెస్ కూటమి విజయం సాధించింది. గతంలో ఎన్నడు లేని మెజారిటీలు సాధించింది.

గెలిచామని భావించిన బీఆర్ఎస్ భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావుకు కూడా హస్తం గూటికి చేరడంతో లోక్‌సభ ఎన్నికల్లో ఎమ్మెల్యేలు లేకుండానే మాజీ ఎమ్మెల్యేలతో బీఆర్ఎస్ ఎన్నికల్లో విజయం కోసం ప్రతిష్ఠాత్మకంగా పోరాటం ప్రారంభించింది. అసెంబ్లీ ఎన్నికల ఓటు బ్యాంకును పెంచుకుని విజయం సాధించాలని పార్టీ ప్రతిష్ఠను కాపాడుకోవాలని అటు అభ్యర్థులు ఇటు కేడర్ ఉన్నంతలో ప్రచారాన్ని సాగిస్తున్నారు. ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి ఆపార్టీ లోక్‌సభ పక్ష నేతగా ఉన్న నామా నాగేశ్వరరావు నియోజకవర్గంలో సభలు, సమావేశాలు పెట్టి ప్రచారం సాగిస్తున్నారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌తో పాటు మాజీ ఎమ్మెల్యేలు ప్రచారంలో పాలుపంచుకుటున్నారు.

మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నియోజకవర్గ కార్యక్రమాలకు హాజరవుతున్నా ఇతర నియోజకవర్గాల్లో మాత్రం ప్రచారంలో పాలుపంచుకోవడం లేదు పాలేరులో మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల అనంతరం పూర్తిగా దూరంగా ఉన్నారు. సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, జడ్పీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజ్ వైరాలో మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్, బానోతు చంద్రావతి, కొత్తగూడెంలో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, అశ్వారావుపేటలో మాజీ ఎమ్మెల్యేలు తాటి వెంకటేశ్వర్లు , మెచ్చా నాగేశ్వరరావులు ప్రచారంలో పాలుపంచుకుంటున్నారు.

మహబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ తదితరులు ప్రచారం సాగిస్తున్నారు. ఇటు ఖమ్మంలో నామా గెలుపుకోసం అటు భద్రాద్రి కొత్తగూడెంలో బీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవిత కోసం పార్టీ శ్రేణులు శ్రమిస్తున్నాయి. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలు బీఆర్ఎస్ కేడర్‌కు జీవన్మరణ సమస్యగా కనిపిస్తుంది. ఈ ఎన్నికల్లో సత్తా చూపితేనే పార్టీతోపాటు కేడర్, నాయకుల భవిష్యత్ ముడిపడి ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో భారీ వ్యత్యాసంతో ఓటమి చూసిన బీఆర్ఎస్ లోక్‌సభ ఎన్నికల్లో మార్పు ఉంటుందని ఆరాటపడి ప్రచారం సాగిస్తున్నారు.

కాంగ్రెస్ మహబాద్ లోక్‌సభ అభ్యర్థిగా కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్ బీఆర్ఎస్ అభ్యర్థిగా మాలోతు కవిత, బీజేపీ అభ్యర్థిగా మాజీ ఎంపీ సీతారాంనాయక్ ప్రచారం సాగిస్తున్నారు. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి ఇంకా తేలాల్సి ఉంది. బీఆర్ఎస్‌నుంచి ఎంపీ నామా, బీజేపీ నుంచి తాండ్ర వినోద్ రావు ప్రచారంలో ఉన్నారు. ఖమ్మంలో బీఆర్ఎస్ గత ఎన్నికల్లో తొలిసారి జెండా ఎగురవేయగా మహబాద్‌లో 2014లో సీతారాంనాయక్, 2019లో మాలోతు కవిత విజయం సాధించారు. అక్కడ రెండు సార్లు, ఖమ్మంలో ఒకసారి గులాబీ జెండా ఎగిరింది. మహబూబాబాద్‌లో మూడోసారి ఎగుర వేయాలని ఆపార్టీ ఆశిస్తుండగా ఖమ్మంలో రెండోసారి గెలిపించాలని పార్టీ కేడర్ ప్రచారాన్ని ప్రారంభించింది. ఈ ఎన్నికల్లో చూపించే పట్టుతోనే జిల్లాలో ఆపార్టీ పట్టు నిలబడే పరిస్థితి ఉంది. పట్టు కోల్పోతే పార్టీ నుంచి ఉన్న నేతల్లో కూడా ఫిరాయింపులు ఇతర పార్టీల్లోకి వెళ్లే ప్రమాదం లేకపోలేదు. తద్వారా పార్టీ ప్రతిష్ఠ పూర్తిగా మసకబారే అవకాశం ఉంది.

మానుకోటలో కాస్త నయం

మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇల్లెందు, పినపాక లో కాంగ్రెస్‌లో గెలవగా భద్రాచలంలో బీఆర్ఎస్ నుంచి తెల్లం వెంకటరావు గెలిచారు. ఇప్పుడు ఆయన కూడా కాంగ్రెస్‌లో చేరారు. ఈమూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి 2,47,214 ఓట్లు లభించగా, బీఆర్ఎస్‌కు 1,61,118 ఓట్లు లభించాయి. మూడు నియోజక వర్గాలు మినహా కాంగ్రెస్ పార్టీకి 86,096 ఓట్లు ఆధిక్యత లభించింది. ఇప్పుడు ఖమ్మం, అటు మహబాద్ లోక్‌సభ నియోజక వర్గాల్లో కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ కంటే భారీ ఆధిక్యతతో నిలిచి ఉంది.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది నియోజక వర్గాల్లో చూస్తే బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్‌కు 3,52258 ఓట్ల ఆధిక్యత అసెంబ్లీలో లభించింది. పది నియోజక వర్గాల్లో కాంగ్రెస్‌కు 9,80,507 ఓట్లు లభించగా బీఆర్ఎస్‌కు 628,549 ఓట్లు లభించాయి. ఈ వ్యత్యాసాన్ని అధిగమిస్తేనే బీఆర్ఎస్ ప్రతిష్ఠ కాపాడుకుని పార్టీని నిలబెట్టుకునే పరిస్థితి నెలకొంది.

అసెంబ్లీ ఎన్నికల్లో దెబ్బతిన్న బీఆర్ఎస్..

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఉమ్మడి జిల్లాలో దారుణంగా దెబ్బతిన్నది. బీఆర్ఎస్ నుంచి తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్ఎస్ కేడర్‌తో పాటు టీడీపీ సానుభూతి ఓటు బ్యాంకు కాంగ్రెస్ ఖాతాలో చేరి మెజారిటీలు పెంచింది.

ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో కాంగ్రెస్, సీపీఐ కూటమి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఘన విజయం సాధించింది. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో పాలేరు, ఖమ్మం, మధిర, వైరా , సత్తుపల్లి , అశ్వారావుపేట, కొత్తగూడెం నియోజకవర్గాలుండగా కొత్తగూడెంలో కాంగ్రెస్ మద్దతుతో సీపీఐ విజయం సాధించగా మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించారు. మొత్తం లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ కూటమికి 7,33,293 ఓట్లు లభించగా, బీఆర్ఎస్ అభ్యర్థులకు 4,67,631 ఓట్లు లభించాయి. మొత్తంగా కాంగ్రెస్‌కు 2,66,162 ఓట్ల మెజారిటీ లభించింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసిన నామా నాగేశ్వరరావుకు ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం నుంచి 5,67,459 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి రేణుకాచౌదరికి 3,99,395 ఓట్లు లభించాయి. అయితే ఉమ్మడి జిల్లాలో 9 చోట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ప్రాతినిధ్య వహిస్తుండటం, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భారీ మెజారిటీలు దక్కడంతో బీఆర్ఎస్‌కు ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలు అగ్నిపరీక్షగా మారాయి.

'కోడ్' కత్తి వేలాడుతోంది జాగ్రత్త!

- ప్రచారం చేసినా, మద్దతు తెలిపినా వేటే
- ఎన్నికల వేళ ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్నో పరిమితులు
- పాటించాల్సి నిబంధనలపై అవగాహన తప్పనిసరి



ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్18: ప్రస్తుతం ఎన్నికల చర్చలు వాడివేడిగా కొనసాగుతున్నాయి. ఇల్లు, కార్యాలయం సహోద్యోగులతో.. బయటి మిత్రులతో.. ప్రయాణంలో తోటి ప్రయాణికులతో రాజకీయాల గురించి చర్చించు కుంటున్నారు. ఎక్కడైనా ఒకే మాట.. ఒకే పాట..ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది. తమ నియోజకవర్గంలో ఎవరికి టిక్కెట్టు ఇస్తారు. ఎవరైతే గెలుస్తారు? ఈ అంశాలపైనే జనాభిప్రాయాలు పలు విధాలుగా చక్కర్లు కొడుతున్నాయి. ఒక్కొక్కరు ఒక్కో అభిప్రాయాన్ని తమ సన్నిహితులతో, సామాజిక మాధ్య మాలద్వారా పంచుకుంటున్నారు. ప్రచారాల పట్ల ప్రభుత్వఉద్యోగులు జాగ్రత్తగా ఉండాలని ఎన్నికల సంఘం నిబంధనలు చెబుతున్నాయి.

● ఎన్నికల సంఘం పరిధిలో....

ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ భారత రాజ్యాంగం వాక్ స్వాతంత్ర్యం (మాట్లాడే స్వేచ్ఛ) కల్పించింది. కొన్ని సందర్భాల్లో అందరిలా ప్రభుత్వ ఉద్యోగులు తమ అభిప్రాయాలను ఇష్టారాజ్యంగా ప్రచారం చేయడం కుదరదు, తమకు ఇష్టం వచ్చినట్లు సామాజిక మాధ్యమాల్లో చర్చించుకోవడం వీలు కాదు, మార్చి 18న ఎన్నికల సంఘం సాధారణ ఎన్నికలకు షెడ్యూల్‌ను జారీ చేసింది. అప్పటి నుంచి ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు కొన్ని నిబంధనలు వర్తిస్తాయి. వీరంతా కేంద్ర ఎన్నికల సంఘం పరిదిలో నడుచుకోవాల్సి ఉంది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో యంత్రాంగం అప్రమత్తం అయ్యింది. రాజకీయ ప్రజాప్రతినిధులు పార్టీ ప్రచారంలో ప్రభుత్వ ఉద్యోగులు ఉపాధ్యాయులు పాల్గొనడం సామాజిక మాధ్యమాల్లో సొంత అభిప్రాయాలు పోస్టు చేస్తే ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్లే. అలాంటి వారిపై చర్యలు తీసుకునే అధికారం యంత్రాంగానికి ఉంది.

● నిఘా వర్గాల దృష్టి

సంబంధిత విభాగం పరిపాలన వేగవంతంగా సాగేందుకు ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగులు, విద్యాశాఖ సాంకేతికతను వినియోగిస్తోంది. వీటి ఆధారంగా వాట్సాప్‌లో వినూత్న యాప్‌లతో సమాచారం విస్తృతం చేస్తున్నారు. మొన్నటి వరకు పార్టీల గెలుపోటముల సర్వేలపై చర్చ, వారి అభిప్రాయాలు, ఒకరినొకరు విమర్శలు చేసుకున్నారు. జిల్లాలో గత నెల రోజుల నుంచి ఎన్నికల కోడ్ అమలులో ఉంది. కోడ్ నిబంధనలు ఉల్లంఘించి ఉద్యోగులు ఏదైనా పార్టీ ప్రచారంలో పాల్గొనడం, పరోక్షంగా సహకరించడం చట్ట విరుద్ధం.

● సామాజిక మాధ్యమాలపై నిఘా..

సామాన్యులతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయులు సైతం ఫేస్‌బుక్ పేజీలు, వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెడుతున్నారు. సాంకేతికత పెరిగినందున ఈ సారి సామాజిక మాధ్యమాల ప్రచారంపై సైతం నిఘా ఉంది. ఏ పార్టీ అభ్యర్థి కోసం ప్రచారం చేసిన చర్యలు తప్పవు. జిల్లాలో ఉన్న పలు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు వివిధ పార్టీలకు పరోక్షంగా సహకరిస్తుండగా కొన్ని పార్టీలు అనుబంధ సంఘాలుగా ఉన్నాయి. కోడ్ వీగిపోయే వరకు ఈ సంఘాలన్నీ అప్రమత్తంగా ఉండకపోతే ఇబ్బందుల్లో పడతాయి. పూర్తిస్థాయి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి రావడంతో అన్ని రకాల ప్రచారాలపై యంత్రాంగం దృష్టి సారించింది. ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎటు వంటి ప్రచారానికి సహకరించకూడదు. ఈ విషయమై ఫిర్యాదులు వచ్చినా.. అటువంటి వీడియోలు, ఫొటోలు బయటకు వచ్చినా కఠిన చర్యలు తీసుకునేందుకు ఈసీ సిద్ధంగా ఉంది.

● హెచ్చరికలు ఇలా....

ఎన్నికల ప్రచారానికి సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం కఠినంగా వ్యవహరించనుంది. ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ పార్టీలకు ప్రచారం చేయరాదని 1949 సెప్టెంబరు 17 ముచే ఈ నిబంధనలు అమల్లో ఉన్నాయి.23(ఐ) సెక్షన్ ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల కోడ్ పరిధిలోకి వస్తారు. ఫలానా పార్టీ అభ్యర్థికి ఓటు వేయండి. అంటూ నలు గురితో మాట్లాడినా.. బంధువులకు తెలిపినా.. సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసినా చర్యలు తప్పవని హెచ్చరించింది. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు, వివిధ కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా సెక్షన్ 26(ఐ)ను అమలు చేసేందుకు రంగం సిద్ధం చేసింది.

మోగిన ప్రచారభేరి

ఖమ్మం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రచార ఘట్టానికి పార్టీ అధినేతలు రంగంలోకి దిగుతున్నారు. జాతీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీల నుంచి ముఖ్యనేతలు ప్రచారభేరికి రాబోతున్నారు. నామినేషన్ల ఘట్టం ప్రారంభంకావడంతో ప్రచార ఘట్టాన్ని వేగం పెంచబోతున్నారు. గురువారం లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఆయా పార్టీల అభ్యర్థులు నామినేషన్ల కార్యక్రమం కూడా ప్రారంభించారు ఈనేపథ్యంలో ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లో ప్రచారాలను సభలు, రోడ్‌షోల ద్వారా ప్రధనా పార్టీలు ప్రజల్లోకి వెళుతున్నాయి. మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలోని మానుకోటలో పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జనజాతర సభ నిర్వహించి మహబాద్ అభ్యర్థి బలరాం నాయక్ గెలుపుకోసం ప్రచార భేరీ మోగించబోతున్నారు. ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ తర్వాత ఖమ్మంలో కూడా రేవంత్‌రెడ్డి జనజాతర సభ ఖమ్మంలో ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ తరుపున జిల్లాలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు ప్రచారం సాగిస్తుండగా సీఎం రేవంత్‌రెడ్డి కూడా ప్రచారంలోకి దిగుతున్నారు. ఇక ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు, మహబాద్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి కవితల విజయం కేసీఆర్ జిల్లాలో బస్సుయాత్ర నిర్వహించబోతున్నారు. ఈయాత్రకు తేదీ ఖరారు కానుం ది.

ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ ముఖ్య నేతలతో హైదరాబాదులో కేసీఆర్ సమావేశమయ్యారు. బస్సుయాత్ర గురించి చర్చించారు. ఇందుకు సంబంధించి రూట్‌మ్యాప్ తయారు చేయాలని జిల్లా నేతలకు కేసీఆర్ సూచించారు. ఖమ్మం కొత్తగూడెం వంటి పట్టణాలతో పాటు మండల కేంద్రాల మీదుగా బస్సుయాత్ర సాగనుంది. రైతు పొలాలకు వెళ్లి రైతులతో కేసీఆర్ ముఖాముఖి కార్యక్రమం కూడా నిర్వహించబోతున్నారు. ఇక బీజేపీ కూడా జిల్లాలో ప్రచార భేరీ మోగించబోతుంది. శుక్రవారం ఆపార్టీ అభ్యర్థి తాండ్ర వినోదరావు ఖమ్మం లోక్‌సభకు నామినేషన్ వేయబోతున్నారు.

ఈసందర్భంగా కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాద్‌సింగ్ ఖమ్మంలో ప్రచారానికి రాబోతున్నారు. ఖమ్మంలో రోడ్‌షో, ర్యాలీ నిర్వహించి సభల్లో ప్రసంగించనున్నారు. ఆతర్వాత దశల వారీగా పలువురు కేంద్ర మంత్రులు జిల్లా పర్యటనకు రానున్నారు. బీజేపీ స్పెషల్ జోన్‌గా ఖమ్మం , మహబాద్ లోక్‌సభలను గుర్తించింది. ప్రదాని మోదీతో పాటు యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాద్ తోపాటు పలువురితో సభలు పెట్టించేందుకు బీజేపీ నేతలు భావిస్తున్నారు.

ఖమ్మం లోక్‌సభ స్థానానికి తొలి రోజు బోణీ

● ఆధార్ పార్టీ తరపున కుక్కల నాగయ్య నామినేషన్ దాఖలు

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 18: ఖమ్మం లోక్‌సభ స్థానానికి నామినేషన్ల పర్వంలో తొలిరోజు ఒక నామినేషన్ దాఖలైంది. ఆధార్ పార్టీకి చెందిన అభ్యర్థి కుక్కల నాగయ్య గురువారం తన నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీపీ గౌతమ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి నామినేషన్ వేయడానికి వచ్చిన అభ్యర్థితో ఎన్నికల నిబంధనలను తు.చ. తప్పకుండా పాటిస్తామంటూ ప్రమాణం చేయించారు. నామినేషన్ దాఖలు చేసిన కుక్కల నాగయ్య ముదిగొండ మండలం గంధశిరికి చెందిన యువకుడు. తనతోపాటు, తన భార్య నాగమణిపేరిట ఎలాంటి చర స్థిరాస్తులు లేవని అఫిడవిట్‌లో తెలిపారు. తనకు రూ.50వేల నగదు తన భార్యకు రూ.50వేల నగదు ఉందని, తనకు రూ.35వేల విలువ చేసే బంగారం, తన భార్యకు రూ.70వేల విలువ చేసే బంగారం ఉన్నట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

ఎన్నికల వ్యయ పరిశీలకుల రాక

ఖమ్మం లోక్‌సభ ఎన్నికల వ్యయ పరిశీలకులుగా అరుణ్‌ప్రసాత్ కృష్ణస్వామి, శంకరనంద్ మిశ్రాలు నియమితులయ్యారు. వ్యయ పరిశీలకులు అరుణ్ ప్రసాత్ కృష్ణస్వామి, శంకర నంద్ మిశ్రాలు గురువారం జిల్లాకు చేరుకున్నారు.వారికి కలెక్టరేట్ ఛాంబర్ లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ స్వాగతం పలికి పూలమొక్కలు అందించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు విధులు నిర్వహించనున్నట్లు వారు ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం వారు కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం, మీడియా కేంద్రంను పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి వీపీ గౌతమ్ మాట్లాడుతూ డబ్బు, మద్యం, ప్రలోభాల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గురువారం నాటికి సి-విజిల్ ద్వారా 38 ఫిర్యాదులు, 1950 టోల్ ఫ్రీ ద్వారా 64 ఫిర్యాదులు రాగా పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. నగరపాలక కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ సహాయ కలెక్టర్ మిర్నల్ శ్రేష్ఠ, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, సీపీవో శ్రీనివాస్ ఆయన వెంట ఉన్నారు.

ఈవీఎంల రవాణాకు పటిష్ఠ చర్యలు...

ఖమ్మం కలెక్టరేట్: లోక్‌సభ సాధారణ ఎన్నికలకు ఈవీఎంల రవాణాకు పకడ్బందీ కార్యాచరణ చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. గురువారం ఆయన కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో ఈవీఎంల రవాణా, స్ట్రాంగ్ రూంల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నూతన కలెక్టరేట్ లో ఈవీఎంల గిడ్డంగి నుంచి సెగ్మెంట్ల వారీగా కేటాయించిన ఈవీఎంలను ఆయా సెగ్మెంట్లలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలకు రవాణా చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుసూ దన్ నాయక్, శిక్షణ సహాయ కలెక్టర్ మిర్నల్ శ్రేష్ఠ, జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, జిల్లా రవాణా అధికారి అఫ్రీన్, జిల్లా కోశాధికారి సత్యనారాయణ, ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం పవిత్ర, కలెక్టరేట్ ఏవో అరుణ, ఎంవీఐలు వరప్రసాద్, వెంకట రమణ పాల్గొన్నారు.

'లోక్‌సభ ఎన్నికల్లో యూసీసీఆర్ఐ(ఎం-ఎల్) పార్టీ పోటీ'

ఖమ్మంచర్చికాంపౌండ్, ఏప్రిల్ 18: పార్లమెంట్ ఎన్నికల్లో యూసీసీఆర్ఐ(ఎం-ఎల్) పార్టీ పోటీ చేస్తుందని ఆపార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకులు దండా లింగయ్య, గ్రామీణ పేదల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పడిగ యర్రయ్య పేర్కొన్నారు. గురువారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ యూసీసీఆర్ఐ (ఎంఎల్)11-లోక్‌సభ స్థానాలకు పోటీ చేస్తుందన్నారు. ఈ సమావేశంలో కల్తి రామచంద్రయ్య, కల్తి లెనిన్, రాము, సంధ్య తదితరులున్నారు.

ఎన్నికల్లో సూక్ష్మపరిశీలకుల పాత్ర ప్రధానం

మాస్టర్ ట్రైనర్ కొండపల్లి శ్రీరాం

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 18: లోకసభ సాధారణ ఎన్నికల్లో సూక్ష్మ పరిశీలకుల పాత్ర అత్యంత ప్రధానమని లోకసభ ఎన్నికల జిల్లా స్థాయి మాస్టర్ శిక్షకులు, జిల్లా ఉపాధికల్పన అధికారి శ్రీరామ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి మాస్టర్ శిక్షకులు, ఎల్డీఎం శ్రీనివాసరెడ్డితో కలిసి సూక్ష్మ పరిశీలకుల (మైక్రో అబ్జర్వర్) శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టి విధులపై అవగాహన కల్పించారు. లోకసభ ఎన్నికల నిమిత్తం 270 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి మాస్టర్ శిక్షకులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు మదన్ గోపాల్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సూక్ష్మ పరిశీలన సమావేశానికి హాజరైన అధికారులు

బలరాంనాయక్ నామినేషన్‌కు భారీగా తరలిరావాలి

● మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కామేపల్లి, ఏప్రిల్ 18: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలరాం నాయక్ నామినేషన్‌కు కార్యకర్తలు భారీగా తరలిరావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం పాత లింగాలలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి పాల్గొన్నారు. శుక్రవారం జరిగే నామినేషన్‌కు కార్యక్రమానికి భారీగా కాంగ్రెస్ కార్యకర్తలు తరలిరావాలని అన్నారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మున్సిపల్ ఛైర్మన్ డీవి, చరణ్‌రెడ్డి, సాదు రమేస్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు, గింజల నర్సింహరెడ్డి, ఎంపీటీసీలు జగన్నాథరెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య, వీర భద్రం, ఏపూరి మహేందర్, డీఎస్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి తుమ్మలను సన్మానిస్తున్న నాయకులు

'కమలం'లో కదనోత్సాహం

- నేడు బీజేపీ జాతీయ నేత, కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ రాక
- ఖమ్మం ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు నామినేషన్ సందర్భంగా ర్యాలీ, రోడ్‌షో



ఖమ్మం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం లోక్‌సభ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తాండ్ర వినోద్‌రావు గెలుపు కోసం బీజేపీ జాతీయనేత, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ శుక్రవారం ఖమ్మంలో ప్రచారం నిర్వహించబోతున్నారు. ఈ సందర్భంగా బీజేపీ శ్రేణులు రోడ్‌షోకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గానికి బీజేపీ అభ్యర్థిగా వినోద్‌రావు పార్టీ ముఖ్యనేతలతో కలిసి ఉదయమే కలెక్టరేట్‌కు వెళ్లి నామినేషన్ దాఖలు చేయనున్నారు. అనంతరం మధ్యాహ్నం ర్యాలీ నిర్వహించనున్నారు. రాజ్‌నాథ్‌సింగ్ మధ్యాహ్నం 1.50గంటలకు బేగంపేటలో బయలుదేరి 2.40 గంటలకు నగరంలోని సర్దార్ పటేల్‌స్టేడియానికి చేరుకుంటారు. అక్కడినుంచి ఖమ్మంలోని వైరారోడ్డులో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ సెంటర్, మయూరిసెంటర్‌లో రోడ్‌షోలో ప్రసంగించనున్నారు. మధ్యాహ్నం 3.50 గంటలకు సర్దార్ పటేల్ స్టేడియానికి చేరుకుని హెలీకాప్టర్‌లో విజయవాడకు బయలుదేరుతారు.

రాజ్‌నాథ్‌సింగ్ రోడ్‌షోకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉమ్మడి జిల్లానుంచి హాజరవుతున్నారు. రాజ్‌నాథ్‌సింగ్‌తోపాటు రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల కో ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, క్లస్టర్ ఇన్‌చార్జి మార్తినేని ధర్మారావు, పార్లమెంట్ ఇన్‌చార్జి నంబూరి రామలింగేశ్వరరావు, కిసాన్‌మోర్చా రాష్ట్ర నాయకులు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, రంగా కిరణ్ తదితరులు పాల్గొననున్నారు.

బీజేపీ వైపే ఖమ్మం జిల్లా ప్రజలు

ఖమ్మం జిల్లా ప్రజలు బీజేపీ వైపే ఉన్నారని లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టబోతున్నారని బీజేపీ నేతలు ధీమా వ్యక్తం చేశారు. నగరంలోని బీజేపీ ఎన్నికల క్యాంపు కార్యాలయంలో అభివృద్ధి జరుగుతుందన్నారు. గురువారం లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ తదితరులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

బీజేపీ అభ్యర్థి వినోద్‌రావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా ప్రజలు బీజేపీని గెలిపించేందు కు ఆసక్తి చూపిస్తున్నారని తెలిపారు. కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఎన్నికల ప్రచారాన్ని విజయవంతం చేసేందుకు 2వేల మందితో కూడిన కళాబృందాలు పాల్గొంటున్నాయని తెలిపారు.

కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను ప్రజలు నమ్మడం లేదని, బీఆర్ఎస్ పని అయిపోయిందని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీ-కాంగ్రెస్ మధ్య పోటీ ఉందన్నారు. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రుల పట్ల ప్రజలు వ్యతిరేకతతో ఉన్నారని, మార్పుకోసం బీజేపీని గెలిపించనున్నారని తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ శుక్రవారం ఖమ్మంలో రాజ్‌నాథ్‌సింగ్ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో నన్నె ఉదయ్‌ప్రతాప్, వీరెల్లి లక్ష్మయ్య, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, శ్యామ్‌రాథోడ్, చావా కిరణ్, బొళ్ల బిక్షపతి పాల్గొన్నారు.

నిప్పులు కురిపిస్తున్న ఎండలు

ఖమ్మం కార్పొరేషన్/కొత్తగూడెం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : భానుడు భగభగ మండిపోతున్నాడు. ఖమ్మం జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. గత మూడురోజులుగా విపరీతంగా వీస్తున్న వడగాల్పులు ప్రజలను అతలాకుతలం చేస్తున్నాయి. జిల్లాలోని పెనుబల్లిలో గురువారం అత్యధికంగా 44.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. బుధవారం కూడా జిల్లాలో 44డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గత నాలుగురోజులుగా జిల్లాలో ఉష్ణోగ్రతలు 43నుంచి 44డిగ్రీలుగా నమోదవుతుండగా గురువారం అత్యధికంగా 44.9డిగ్రీలు నమోదు కావటంతో పలువురు వడదెబ్బకు గురవుతున్నారు.

పలు మండలాల్లో రెడ్‌అలర్ట్

ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లాలోని పలుమండలాల్లో అధికారులు గురువారం రెడ్‌అలర్ట్ ప్రకటించారు. జిల్లాలోని ఖమ్మంఅర్బన్, సింగరేణి, ఏన్కూరు, తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, ముదిగొండ, కూసుమంచి, ఎర్రుపాలెం మండలాల్లో అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని ఆయా మండలాల్లో రెడ్‌అలర్ట్ ప్రకటించామని అధికారులు తెలిపారు. కాగా ఉష్ణోగ్రతలు 45.1 డిగ్రీలనుంచి 47డిగ్రీలు నమోదవుతే ఆ ప్రాంతాన్ని రెడ్‌అలర్ట్‌గా ప్రకటిస్తారు. రెడ్అలెర్ట్ ప్రకటించిన ప్రాంత్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచటం, అలాగే రహదారులపై నీళ్ల చల్లించటం లాంటి చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.

నిపుల కొలిమిలా కోల్‌బెల్ట్ ప్రాంతాలు

భద్రాద్రి జిల్లాలోనూ ఎండలు మండుతున్నాయి. గురువారం సింగరేణి ప్రాంతంలో ఉష్ణోగ్రతలు 45డిగ్రీలకు చేరుకుంటున్నాయి. అశ్వాపురంలో అత్యధికంగా 44.7డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఓసీల్లో పనిచేసే కార్మికులు విధులకు వెళ్లలేకపోతున్నారు. యాజమాన్యం కార్మికులు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నా అవి ఎంతమాత్రం వారికి ఉపశమనాన్ని ఇవ్వడం లేదు. టేకులపల్లి మండలంలో వడదెబ్బకు గురై వ్యవసాయకూలీ మృతి చెందాడు. జిల్లాలో గత రెండు రోజుల్లో వడదెబ్బతో మృతి చెందారు. ఎండకు భయపడి ప్రజలు ఇళ్లకే పరిమితం కావడంతో పట్టణాలన్నీ జన సంచారం లేక నిర్మానుష్యంగా మారాయి.

ఓటు కథ తెలుసా!



ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్18: ఎక్కడైనా ఏ నోట విన్నా అంతా ఒక్కటే చర్చ.. అదీ ఎన్నికల పైనే.. ఈ సమయంలో ప్రతి ఓటు ఎంతో కీలకం. ఈ సందర్భంలో ఓటు గురించి అందరూ మాట్లాడుకుంటున్నప్పటికీ.. ఓటు హక్కు పుట్టు పూర్వోత్తరాలు తెలిసింది అతి తక్కువ మందికే. ఆంగ్లేయుల కాలంలో మొదలైన ఈ ప్రక్రియ 1988 నాటికి ఓ రూపానికి వచ్చింది. ఓటు అసలు కథ లోకి వెళ్తే.. బ్రిటిష్ పాలనలో పరిమిత ప్రాతిపదికన భారతీయులకు కల్పించిన ఓటు హక్కును - భారత రాజ్యాంగం పౌరులందరికీ సార్వత్రిక వయోజన ఓటు హక్కుగా కల్పించింది. 1907లో ఏర్పడిన 'రాయల్ కమిషన్ స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఓటుహక్కుపై చేసిన సిఫార్సుల ఆధారంగా 1909 కౌన్సిల్ చట్టం పరిమిత ప్రాతిపదికన భారతీ యులకు ఓటు హక్కు కల్పించారు. 1919 కౌన్సిల్ చట్టం ఈ హక్కును కొంత మేర విస్తృతపరిచింది.

1935 భారత ప్రభుత్వచట్టం ద్వారా ఈ హక్కును 10.6 శాతానికి పెంచారు. రాజ్యాంగ పరిషత్తు ఎన్నికల సందర్భంగా 28.5 శాతం ప్రజలకు దీన్ని విస్తరింపచేశారు. స్వాతంత్ర్యానంతరం భారత ప్రభుత్వం ప్రజాస్వామ్య విధానానికి కట్టుబడి ఉండడంతో రాజ్యాంగం భారత పౌరులకు సార్వత్రిక వయోజన ఓటుహక్కును కల్పించింది. ప్రజాస్వామ్యంలో సమానత్వ సూత్రాన్ని అనుసరించి ఒక వ్యక్తికి ఒక ఓటును మాత్రమే కల్పించారు. అధీకరణ 325 ప్రకారం కుల, మత, వర్గ, వర్ణ, జాతి, ప్రాంత, లింగ బేధాలు వంటి తేడాలతో ఏ వ్యక్తికీ ఓటు హక్కు నిరాకరించ కూడదు. 1952లో సాధారణ ఎన్నికల సందర్భంగా 326వ అధీకరణ కింద సార్వత్రిక వయోజన ఓటు హక్కును కల్పించిది. అయితే 1988లో 61వ రాజ్యాంగ సవరణ ద్వారా అప్పటి రాజీవ్‌గాంధీ ప్రభుత్వం ఓటు హక్కు వయోపరిమితిని 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించింది. ఇదీ ఓటుహక్కు అసలు సంగతి.

లంచగొండుల ఆటకట్టు

(5వ పేజీ తరువాయి)

ముగ్గురు నిందితులను తలా రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. లంచం నగదు రూ.20వేలకు తగ్గించాలని పోలీసులను కోరగా అందుకు తిరస్కరించారు. దీంతో సాయితేజ ఈ విషయంపై ఖమ్మంలోని ఏసీబీ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు.

ఈ క్రమంలో ఏసీబీ అధికారులు పోలీసులను ట్రాప్ చేసేందుకు సిద్ధమయ్యారు. పథకం ప్రకారం గురువారం మధ్యాహ్నం లంచం నగదు రూ.20వేలు తీసుకొని తన మిత్రులతో కలిసి వచ్చిన సాయితేజ స్టేషన్‌లో ఉన్న కానిస్టేబుల్ శంకర్‌కు ఇచ్చాడు. దాంతో అతడు ఎస్ఐ శ్రీనివాసుకు ఫోన్ చేసి రూ.20వేలు ఇచ్చారని చెప్పగా సాయంత్రం వరకు మరో రూ.5వేలు ఖచ్చితంగా ఇవ్వాల్సిందేనని ఎస్ఐ తెలిపాడు. అనంతరం కానిస్టేబుల్ వారికి ఆటోను అప్పగించాడు. తరువాత వారి సెల్‌ఫోన్లను అప్పగిస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి ప్రత్యక్షంగా పట్టుకున్నారు. అనంతరం ఎస్ఐ మూలగుండ్ల శ్రీనివాసు, కానిస్టేబుల్ శంకరశెట్టి శంకర్, సీసీ కెమెరా టెక్నీషియన్ కర్నాటి నవీన్‌లను విచారించారు. వారిని ఖమ్మం ఏసీబీ డీఎస్పీ కార్యాలయానికి తరలించి పూర్తిస్థాయిలో విచారణ చేస్తామని ఏసీబీ వరంగల్ డీఎస్పీ సాంబయ్య, ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్, మహేష్ రాజు తెలిపారు.

ఎల్ఆర్ఎస్ అప్రూవల్‌కోసం లంచం తీసుకుంటూ..

ఎల్ఆర్ఎస్ అప్రూవల్ కోసం రూ.15వేలు లంచం తీసుకుంటూ పాల్వంచ మునిసిపాలిటీ టౌన్‌ప్లానింగ్ అధికారి ఏసీబీకి చిక్కారు. పాల్వంచ మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఏసీబీ అధికారులు జరిపిన దాడిలో మహిళా అధికారితో పాటు ఆమెకు సహకరించిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఏసీబీ డీఎస్పీ యాకాంబరం రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ పట్టణానికి చెందిన కాంపెల్లి కనకేష్ తనకు సర్వే నెంబర్ 817/41లో ఉన్న మూడు ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ కోసం మార్చిలో దరఖాస్తు చేసుకున్నాడు. ఇందుకోసం పాల్వంచ మునిసిపాలిటీ టౌన్ ప్లానింగ్ విభాగంలో టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ లక్కిరెడ్డి వెంకటరమణిని కలిసి తన వద్ద ఉన్న ఆధారాలను సమర్పించాడు. కానీ ఆమె ప్లాటుకు రూ.10వేలు చొప్పున రూ.30వేలు లంచం ఇవ్వాలని అదే విభాగంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ప్రసన్నకుమార్ ద్వారా డిమాండ్ చేసింది. దీంతో కనకేష్ ఆమెతో బేరమాడి రూ.15వేలు ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకుని ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు గురువారం మధ్యాహ్నం సదరు అధికారి చాంబర్‌లో ఆమెను కలిసి రూ.15 వేలు ఇచ్చాడు. ఈ సమయంలో ఏసీబీ అధికారులు ఆమెను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితులు, సాక్షులు, సహోద్యోగుల నుంచి వాగ్మూలం తీసుకుని ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. ఈ రైడ్‌లో ఏసీబీ డీఎస్పీ రమేష్, ఇన్‌స్పెక్టర్లు సునీల్, శేఖర్, రామారావు పాల్గొన్నారు.

జయహో.. రామచంద్రా!


పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న గవర్నర్ రాధాకృష్ణన్


గోదావరి నుంచి తీర్థబిందెలు తీసుకెళ్తున్న అర్చకులు


రామయ్య పట్టాభిషేకం తిలకిస్తున్న భక్తులు

» రాజలాంఛనాలతో భద్రాద్రి రామయ్యకు పట్టాభిషేకం » ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించిన గవర్నర్

భద్రాచలం, ఏప్రిల్ 18: భద్రాచలంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీరాముడికి వైభవంగా మహాపట్టాభిషేకం నిర్వహించారు. శ్రీరామనవమి రోజు సీతా రాముల కల్యాణం జరిగిన మరుసటి రోజు శ్రీరాముడి పట్టాభిషేకం నిర్వహించే సంప్రదాయం ఒక్క భద్రాచలంలోనే ఉంది. మహాపట్టాభిషేకం అనంతరం పండితులు నదీజలాల మహాకుంభతీర్థ ప్రోక్షణంతో భక్తులు పునీతులయ్యారు. భద్రాద్రిలో శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణం, శ్రీరామమహాపట్టాభిషేకం విజయవంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. బుధవారం శ్రీరామనవమి సందర్భంగా కన్నుల పండువగా సాగిన సీతారాముల కల్యాణ వేడుకకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు అందజేశారు. గురువారం జరిగిన శ్రీరామమహాపట్టాభిషేక వేడుకకు రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించారు. కంచికామకోటి పీఠాధిపతులు శంకర విజయేంద్ర సరస్వతీస్వామి తరపున శ్రీపాద శ్రీకర్, ఆహోబిలం మఠం తరపున కృష్ణచైతన్య, తూము నరసింహదాసు వారసుల తరపున పట్టాభిషేక సందర్భాన్ని పురస్కరించుకుని రామయ్యకు పట్టు వస్త్రాలను సమర్పించారు.

రాజలాంఛనాలతో పట్టాభిషేకం

అంతకుముందు నూతన దంపతులైన సీతారామచంద్ర స్వాములను పట్టాభిషేకం వేడుకకు మేళతాళాలు, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ మిథిలాస్టేడియంలోని వేదిక వద్దకు తీసుకొచ్చారు. అనంతరం ప్రత్యేక పూజకార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహాపట్టాభిషేక విశిష్టతను స్థానాచార్యులు కేశఈ స్థలశాయి, రామయణపారాయణ దారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు వివరించారు. అనంతరం కలశాలకు ఆరాధన నిర్వహించి రాజలాంచనాలతో పట్టాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమయంలో ముందుగా స్వర్ణ పాదుకలు, రాజదండం, రాజముద్రిక, చత్రము, చామరం సమర్పించి పట్టాభిషేకంకు చిహ్నంగా భక్తకోటి జయజయ ధ్వానాల మధ్య కిరీటధారణ గావించారు. ఈ సమయంలో భక్తులు "జైశ్రీరామ్.. జైజైశ్రీరామ్" అంటూ నినదించారు. పట్టాభిషేకం కార్యక్రమం ముగింపు సందర్భంగా చతుర్వేద పఠనం చేసి ఆ తరువాత పుష్కర నదీ జలాల మహాకుంభ తీర్థ ప్రోక్షణంతో భక్తజనాన్ని పావనం చేశారు. కార్యక్రమంలో గవర్నర్ సీపీ. రాధాకృష్ణన్‌తో పాటు దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా, ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్, ఆర్డీవో కె.దామోదర్‌రావు, దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఏఈవో భవానీరామకృష్ణారావు, పర్యవేక్షకులు లిం గాల సాయిబాబా, స్థానాచార్యులు కేశఈ స్థలశాయి ప్రధా న అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, పాల్గొన్నారు.

సంప్రదాయాన్ని కొనసాగించిన గవర్నర్

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో 2011లో నిర్వహించిన పుష్కరసామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవానికి తొలిసారిగా గవర్నర్ దంపతులను భద్రాద్రి దేవస్థానం అధికారులు ఆహ్వానించారు. ఇక అప్పటి నుంచి వారు క్రమం తప్పకుండా రామయ్య బ్రహ్మోత్సవ వేడుకల్లో పాల్గొంటున్నారు. ఈ క్రమంలో ప్రస్తుత గవర్నర్ సీపీ. రాధాకృష్ణన్ కూడా ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ పట్టాభిషేక కార్యక్రమానికి ప్రభుత్వం తరుపున పట్టు వస్త్రాలు తీసుకొని విచ్చేశారు. పట్టాభిషేక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన గవర్నర్ రాధాకృష్ణన్‌కు భద్రాద్రి దేవస్థానం అధికారులు సంప్రదాబద్ధంగా పూర్ణకుంభంతో



స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించిన అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. ఈ సందర్భంగా గవర్నరుకు దేవస్థానం తరపున శాలువ, జ్ఞాపిక, స్వామివారి ప్రసాదంను కమిషనర్ హనుమంతరావు, ఈవో రమాదేవిలు అందజేశారు.

రామనామం దేశాన్ని ఐక్యం చేస్తుంది: గవర్నర్

శ్రీరామ మహాపట్టాభిషేకం సందర్భంగా గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ విలేకరులతో మాట్లాడుతూ దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాద్రి రామాలయాన్ని దర్శించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రామనామం దేశాన్ని ఐక్యం చేస్తుందన్నారు. రామరాజ్యం అంటే ఒకరిని మరొకరు ఇబ్బంది పెట్టడం కాదన్నారు. తప్పు చేసిన వారిని శిక్షించాల్సిందేనన్నారు. అంతటా శాంతినెలకొనాలని గవర్నర్ ఆకాంక్షించారు.

గవర్నర్ పర్యటన సాగిందిలా..

» రామాలయంలో ప్రత్యేక పూజలు

» ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు అందజేత

» ఐదు గంటల పాటు సాగిన పర్యటన

భద్రాచలం/బూర్గంపాడు: భద్రాచలంలో రాష్ట్ర గవర్నరు సీపీ రాధాకృష్ణన్ పర్యటన ఐదు గంటల పాటు సాగింది. భద్రాద్రి రామయ్య పట్టాభిషేకం గురువారం మిథిలా స్టేడియంలోని శిల్పకళాశోభితమైన కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించేందుకు గవర్నరు సంప్రదాయంలో భాగంగా రావ డం జరిగింది. గవర్నరు గురువారం ఉదయం 8.15 గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి భద్రా చలానికి బయలుదేరగా 9.25కి బూర్గంపాడు మండలం సారపాక బీపీఎల్ హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీవో ప్రతీక్‌జై న్ స్వాగతంపలికారు. అ నంతరం ఐటీసీ అతిథి


గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్

గృహానికి చేరుకొని రహదారి మార్గం ద్వారా భద్రాద్రి రామాలయానికి 10 గంటలకు వచ్చారు. ఈ సమయంలో దేవస్థానం అధికారులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. అనంతరం 10.30 గంటలకు కల్యాణ మండపం ప్రాంగణంకు చేరుకొని పట్టాభిషేక కార్యక్రమంలో పాల్గొనడంతో పాటు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. పట్టాభిషేక కార్యక్రమం ముగిసిన అనంతరం ఐటీసీ అతిథిగృహానికి చేరుకొని భోజనం అనంతరం హైదరాబాద్‌కు 2.30కి హెలికాప్టర్‌లో బయలుదేరి వెళ్లారు.


కంచికామకోటి పీఠాధిపతుల శంకరవిజయేంద్ర సరస్వతి తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న శ్రీపాద శ్రీకర్


రామయ్య పల్లకీసేవ

లారీ ఢీకొని వ్యక్తి మృతి

చంద్రుగొండ, ఏప్రిల్ 18: చంద్రుగొండ శివారు అయ్యన్నపాలెం గ్రామం వద్ద జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయవాడకు చెందిన అత్కూరు శ్రీక్రిష్ణ చక్రపాణి(61) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయవాడకు చెందిన శ్రీకృష్ణ చక్రపాణి భద్రాచలంలోని సీతారాముల ఆలయానికి స్కూటీపై బయలుదేరాడు. చంద్రుగొండ శివారు అయ్యన్నపాలెం వద్ద మూలమలుపు తిరుగుతుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ చక్రపాణీ ప్రయాణిస్తున్న స్కూటీని ఢీకొంది. ఈ ప్రమాదంలో చక్రపాణి అక్కడికక్కడే మృతి చెందాడు.

అంకమ్మతల్లి తిరునాళ్ల పోస్టర్‌ను ఆవిష్కరించిన గవర్నర్

బూర్గంపాడు, ఏప్రిల్ 18: అన్నపురెడ్డి మండల కేంద్రంలోని అంకమ్మతల్లి ఆలయ అభివృద్ధి ప్రదాత, హరిహర ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మారగాని శ్రీనివాసరావు గురువారం గవర్నర్ రాధాకృష్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. సారపాకలో గల ఐటీసీ గెస్ట్‌హౌజ్‌లో కలిసి అంకమ్మతల్లి తిరునాళ్లకు ఆహ్వానించారు. గవర్నర్ చేతుల మీదుగా ఆహ్వాన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అన్నపరెడ్డిపల్లి లో ఉన్న శ్రీ శ్రీ అంకమ్మతల్లి తిరునాళ్ల ఈ నెల 18 అర్ధరాత్రి నుంచి 23వరకు అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఈ సందర్భంగా గవర్నర్ ఆలయ అభివృద్ధికి సహకరిస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ దర్మాదాయ కమిషనర్ హనుమంతరావు, రాష్ట్ర గవర్నర్ సంయుక్త కార్యదర్శి భవాని శంకర్, ప్రముఖ అధ్యాత్మిక వ్యక్త దైవజ్ఞ శర్మ, భద్రాచలం రామాలయం ఈవో రమాదేవి ఉన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న గవర్నర్

జమలాపురంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

» ధ్వజ అవరోహరణం » శ్రీవారి చక్రస్నానం » మహా పూర్ణాహుతితో ముగింపు

ఎర్రుపాలెం, ఏప్రిల్ 18: జమలాపురం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం మహా పూర్ణాహుతి నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే శ్రీవారికి సుప్రభాతసేవ, ప్రాతకాల అర్చనలు, నిత్య అనుష్టానములు నిర్వహించారు. ఆలయంలో గత 9రోజులుగా వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ తొమ్మిది రోజులు నిత్యం యాగశాలలో దేవతా హోమాలు నిర్వహించారు. ఈ హోమాలు పరిసమాప్తికి వేదం మంత్రోత్చరణ మధ్య అర్చకుఉల మహా పూర్ణాహుతిని నిర్వహించారు. ఈ పూర్ణాహుతితో సకల మానవాళికి శ్రేయస్సు కలుగుతుందని వేద పండితులు తెలిపారు. అనంతరం బ్రహ్మోత్సవాలు ముగింపు సూచికగా గరుడ ధ్వజాన్ని అవరోహణం గావించారు. తదనంతరం శ్రీవారి ప్రతినిధి చక్రపెరుమాళ్ళని మంగళవాయిద్యాములతో శ్రీవారి పుష్కరిణి వద్దకు తీసుకెళ్లారు. పుష్కరిణిలో గంగాదేవి పూజల అనంతరం చక్రస్నానం నిర్వహించారు. చక్రస్నానం తురువాత చుట్టుప్రక్కల ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు.


ప్రదక్షణలు చేస్తున్న ఆలయ ప్రధాన అర్చకుడు

శ్రీవారికి పల్లకిసేవ నిర్వహించి అర్చకులు, రుత్వికులు, వేద పండితులు, పరిచారకులు ద్వాదశ ప్రదక్షణలుచేసి తిరువీది సేవలతో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాస్‌శర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్ర మూర్తి, సూపరిండెంట్ కె.విజయకుమారి, సిబ్బంది ఇ.కృష్ణప్రసాద్, సాయి, వంశీ, విజయ్, మస్తాన్ పాల్గొన్నారు.

నాగుల్‌మీరా దర్గాలో శ్రీరాముడి పట్టాభిషేకం

» సత్యనారాయణపురంలో వెల్లివిరుస్తున్న మతసామరస్యం


ఇల్లెందు దర్గాలో పట్టాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

ఇల్లెందురూరల్, ఏప్రిల్ 18: ఇల్లెందు మండలం సత్యనారాయణపురంలో శ్రీరామ నవమి సందర్భంగా హిందు, ముస్లింములు ఐక్యతను చాటుతున్నారు. నవమి సందర్భంగా ఊరంతా కలిసి గ్రామంలో ఉన్న హజరత్ నాగుల్‌మీరా దర్గాలో శ్రీరాముడి కల్యాణాన్ని నిర్వహించారు. దర్గాలో గురువారం వేదపండితులు మంత్రోచనణల నడుమ శ్రీరాముడి పట్టాభిషేకం జరిపి మతసామరస్యానికి ప్రతీకగా నిలిచారు. హిందు సంప్రదాయ పద్ధతిలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీరాముడి పట్టాభిషేకం చేశారు. పట్టాభిషేకం మహోత్సావాన్ని తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాలతో పాటు ఇల్లెందు నుంచి భక్తులు భారీగా హాజరయ్యారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

రెండు ద్విచక్రవాహనాల ఢీ: యువకుడి మృతి

● ఇద్దరికి తీవ్ర గాయాలు

జూలూరుపాడు, ఏప్రిల్ 18: మండలంలోని సాయిరాంతండా గ్రామం వద్ద గురువారం సాయంత్రం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటలో ఖమ్మం జిల్లా ఏన్కూ రు మండలం భగవాన్‌నాయక్‌తండా గ్రామానికి చెందిన దారావత్ రాములు (40) మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. భగవాన్‌నాయక్‌తండాకు చెందిన రాములు, గుగులోత్ నరేష్ కలిసి ద్విచక్రవాహనంపై కొత్తగూడెం నుంచి జూలూరుపాడు వైపు వస్తున్నారు. ఈ క్రమంలో సాయిరాంతండాకు చెందిన తేజావత్ చరణ్, బాణోత్ చంద్రశేఖర్ జూలూరుపాడు నుంచి సాయిరాంతండాకు వెళ్తున్నారు. దీంతో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సాయిరాంతండాకు చెందిన ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని జూలూరుపాడులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. మెరుగైన వైద్యం నిమిత్తం కొత్తగూడెం తరలించారు. ఇదిలా ఉండగా సంఘటన స్థలంలో మృతి చెందిన రాములు మృతదేహాన్ని జూలూరుపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే భగవాన్‌నాయక్‌తండాకు చెందిన నరేష్ పరారయ్యాడు. మృతునికి భార్య సక్కుబాయి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి జూలూరుపాడు ఎస్ఐ జీవన్‌రాజు సందర్శించి ప్రమాదం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


రాములు (ఫైల్)

ఆరుకిలోల గంజాయి పట్టివేత

ముదిగొండ, ఏప్రిల్ 18: ఆరు కిలోల గంజాయిని గురువారం ఖమ్మంజిల్లా ముదిగొండ పోలీసులు పట్టుకున్నారు. ముదిగొండ ప్రధాన సెంటర్లో వాహనాలు తనిఖీ చేస్తుండగా సువర్ణాపురం గ్రామానికి చెందిన మధు, నవీన్ ద్విచక్రవాహనంపై గంజాయిని తీసుకొని వెళ్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. వారిని విచారించగా ఖమ్మం పట్టణానికి చెందిన వినయ్, యశ్వంత్, విజయ్, సువర్ణాపురం గ్రామానికి చెందిన మహేష్, కారేపల్లి గ్రామానికి చెందిన ఖాజాలు కలిసి ముఠాగా ఏర్పడి ఆంధ్రాలోని సీలేరు ప్రాంతం నుంచి తీసుకువచ్చి ఖమ్మం పట్టణ, పరిసర ప్రాంతాల్లో గంజాయిని అమ్ముతున్నట్లు ఒప్పుకున్నారని ఎస్ఐ తెలిపారు. వారిచ్చిన సమాచారం మేరకు ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని రెండు ద్విచక్రవాహనాలు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వివరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఖమ్మం సంక్షేమవిభాగం, ఏప్రిల్ 18: విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంఘం-327 కృషి చేస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇమడాల శ్రీధర్ హామీ ఇచ్చారు. గురువారం ఖమ్మంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కిరణ్ కుమార్, జిల్లా కార్యదర్శిగా మధు, కోశాధికారిగా సురేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పలు సంఘాలకు చెందిన ఉద్యోగులు 327లో చేరుతున్నట్లు ప్రకటించారు

అభ్యర్థి ఎవరైనా కాంగ్రెస్ విజయం సాధించాలి

» అశ్వారావుపేట, సత్తుపల్లి ఎమ్మెల్యేలతో సమీక్షలో మంత్రి తుమ్మల


ఎమ్మెల్యేలతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

దమ్మపేట, ఏప్రిల్ 18: ఖమ్మం లోక్‌సభకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎవరైన మెజారిటీతో గెలిపించాలని వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. గండుగులపల్లి ఆయన నివాసంలో సత్తుపల్లి, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, జారే ఆదినారాయణ గురువారం మర్యాదపూర్వకరంగా తుమ్మలను కలిశారు. పార్లమెంట్ ఎన్నిలపై ఎమ్మెల్యేలతో తుమ్మల సమావేశమయ్యారు. సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాల రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు తెలిసింది. పార్లమెంటు అభ్యర్థి ఎవరైనా గెలిపించే బాధ్యత మన అందరిపైన వుందన్నారు. ప్రతిరోజు ఎన్నికలపై మండలాల వారిగా సమీక్షించుకోవాలని చూసించినట్లు తెలిసిం ది. సమస్యలు వుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరినట్లు తెలిసింది. అనంతరం దురదపాడులో జరుగుతున్న అంకమ్మతిరునాళ్ళ మహోత్సవానికి రావల్సిందిగా మంత్రి తుమ్మలను, ఎమ్మెల్యే జారే ఆలయకమిటి సభ్యులు ఆహ్వానించారు. పలు మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకుల తుమ్మలను కలిసారు. తుమ్మలను కలిసిన వారిలో చల్లగుళ్ల నర్సింహారావు, కందిమళ్ళ కృష్ణారావు, ఎంపీపీ సోయం ప్రసాదు, కొయ్యల అచ్యుతరావు, కేవి సత్యనారాయణ, కాసాని నాగప్రసాదు, ఎర్రా వసంతరావు, మంగేశ్వరరావు, మన్నెం అప్పారావు, దొడ్డా ప్రసాదు

సమాచారం లేకుండా విధులకు గైర్హాజరు

» ఉపాధ్యాయుడిపై ఫిర్యాదుచేసిన విద్యార్థుల తల్లిదండ్రులు

» విచారణ నిర్వహించిన కాంప్లెక్స్ హెచ్ఎం

ములకలపల్లి, ఏప్రిల్ 18: ములకలపల్లి మండలం తిమ్మంపేట పంచాయతీ ఆనందపురం పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు గురువారం విధులకు గైర్హాజరై పరీక్షల నిర్వహణ బాధ్యతను అంగన్‌వాడీ టీచర్‌కు అప్పగించారు. పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆనందాపురానికి చెందిన ఉపాధ్యాయుడు ఎల్. కృష్ణ పాఠశాలకు సెలవు పెట్టకుండ స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ టీచరుకు ఫోన్ చేసి మీరు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాలని కోరాడు. దీనికి అంగన్‌వాడీ టీచర్ నిరాకరించింది. ఉదయం 10గంటలు దాటిన ఉపాధ్యాయులు రాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆరా తీశారు. ఉపాధ్యాయుడు రారని పరీక్షల బాధ్యత అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలికి అప్పగించారని తెలియడంతో ఉన్నతాదికారులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలిసిన కమలాపురం పాఠశాల ఉపాధ్యాయుడు కే. వెంకటేశ్వర్లు, కాంప్లెక్స్ హెచ్ఎం సత్యనారాయ ణ పాఠశాలను తనిఖీ చేసి ఉపాధ్యాయుడు రాలేదని గుర్తించారు. విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఈ విషయమై కమలాపురం పాఠశాల హెచ్ఎం కే. వెంకటేశ్వర్లను వివరణ కోరగా ఉపాధ్యాయుడు విధులకు గైర్హాజరయ్యారని,ఈ విషయం ఐటీడీఏ ఉన్నతాధికారులకు తెలియచేస్తానన్నారు.


ఉపాధ్యాయుడు రాక ఖాళీగా ఉన్న కుర్చీ

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

ఖమ్మం ఖానాపురంహవేలి ఏప్రిల్ 18: పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వ విద్య ను బలోపేతం చేయాలని అందుకు పాలకులు కృషి చేయాలని సెంట్రల్ యూనివర్శిటి ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఉస్మానియా యూనివర్శిటి రిటైర్డ్ ప్రొఫెసర్ పద్మజా షా అన్నారు. గురువారం ఖమ్మం నగరంలోని కాకతీయ యూనివర్శిటి సబ్ క్యాంపస్‌లో విద్యా పరిరక్షణ కమిటి ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్‌కు ముఖ్య అతిథులుగా హజరై మాట్లాడారు. గత పాలకులు కార్పొరేట్ ఏజెండాను ముందుకు తీసుకెళ్లేందుకు జాతీయ నూతన విద్యావిధానం 2020 జాతీయ పార్టీ ప్రణాళిక ఫ్రేమ్‌వర్క్ 2023లో తీసుకొచ్చారన్నారు. మత విద్యను ప్రోత్సహిస్తూ విద్యారంగంలో వ్యాపారీకరణ, కార్పొరేటీకరణ, కాషాయికరణ వేగవంతం చేయటానికి విధానాలు రూపొందించారని విమర్శించారు. దేశంలో ప్రభు త్వ విశ్వవిద్యాలయాలను బలోపేతం చేసే విధంగా విదేశీ విశ్వవిద్యాలయాలను దేశంనుంచి పారదోలడానికి విద్యార్థులు పూనుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోహర్‌రాజు, టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్, వివిద విద్యా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ

ఎన్నికల నియమావళి అమలు చేయాలి

» సరిహద్దు వద్ద ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలి: సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం, ఏప్రిల్ 18: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా కేంద్ర పోలీసు బలగాలు, స్థానిక పోలీసుతో పోలీసులు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేసినట్టు ఆ ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అంతర్రాష్ట్ర సరిహద్దులో పటిష్టమైన చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జిల్లాల నుంచి వచ్చే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేస్తున్నారని తెలిపారు. ఆధారాలు చూపించకుండా తరలించే నగదు, నగలు ఇతరత్రా సొత్తును సీజ్ చేసి సంబంధిత అధికారులకు అప్పగిస్తారని తెలిపారు. జిల్లాలో 15ఎఫ్ఎస్‌టీ, 15 ఎస్ఎస్‌టీ, 2 ఇంటిగ్రేటెడ్ ఇంటర్‌స్టేట్ బోర్డర్ చెక్‌పోస్టులు, 10 ఇంటర్‌స్టేట్ చెక్‌పోస్టులు 8 ఇంటర్ స్టేట్ డిస్ట్రిక్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని 24గంటల నిఘా ఉంచామని తెలిపారు. రాత్రి 10:30గంటల నుంచి 11గంటలలోపు వ్యాపార వాణిజ్య దుకాణాలు మూసివేయాలన్నారు. అదేవిధంగా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం, పబ్లిక్ న్యూసెన్స్ రాత్రి సమయాల్లో సమయానికి మించి షాపులు తెరవడం, పుట్టినరోజు పేరుతో రోడ్డుపై వాహనా లు అడ్డంపెట్టి న్యూసెన్స్ చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ ప్రకటనలో ఆదేశించారు.


మధిరలో పోలీసుల తనిఖీలు



బలరాంనాయక్ విజయానికి పనిచేద్దాం: ఎమ్మెల్యే

భద్రాచలం, ఏప్రిల్ 18: మహబూబాద్ పార్లమెంటు అభ్యర్థి పోరిక బలరాంనాయక్ విజయం కోసం అందరం కలిసి పని చేద్దామని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. భద్రాచలంలో గురువారం టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్, ఇతర కాంగ్రెస్ నాయకులతో ఎమ్మెల్యే వెంకట్రావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాత, కొత్త వారితో భద్రాచలం నియోజకవర్గంను అభివృద్ధి చేద్దామని అన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పొదెం వీరయ్య, కాంగ్రెస్ పార్టీలోని అన్ని విభాగాలను కలుపుకొని ఎంపీ అభ్యర్థి విజయం కోసం పని చేద్దామని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బోగాల శ్రీనివాసరెడ్డి, బలుసు నాగ సతీష్, సరెళ్ల నరేష్, కొండిశెట్టి కృష్ణమూర్తి, తాళ్ల రవికుమార్, రమాకాంత్, సరెళ్ల వెంకటేష్, రాసమల్ల రాము, దొడ్డిపట్ల కోటేష్, నిట్ట రాజు, చింతాడి చిట్టిబాబు పాల్గొన్నారు.

నిప్పుల కొలిమిలా మణుగూరు

భానుడి ప్రతాపానికి విలవిల.. గరిష్ఠంగా 44 డిగ్రీలు

బయటకు వచ్చేందుకు భయపడుతున్న ప్రజలు

శీతల పానీయాలకు పెరుగుతున్న గిరాకీ



నిర్మానుష్యంగా మణుగూరు ప్రధాన రహదారి



కరకగూడెం జ్యూస్ సెంటర్ వద్ద సందడి..

మణుగూరు, ఏప్రిల్ 18: మణుగూరు డివిజన్ నిప్పుల కొలిమిగా మారింది. గత రెండు రోజులుగా భానుడు తన ప్రతాపాన్ని చూపుతుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. విపరీతమైన ఎండ మరో వైపు భీకరంగా వీచే వడగాలి తోడవ్వడంతో ఆరుబయట నిలుచునే పరిస్థితులు లేకుండా పోయాయి. ప్రజలు ఇళ్లకే పరిమితం అవుతున్నారు. ఉదయం 8 గంటల నుంచే వేడి ఆరంభం అవుతోంది. మధ్యాహ్న సమయానికి 41 నుంచి 44డిగ్రీల వరకు నమోదు అవుతున్నాయి. చిన్నపిల్లలు వయోవృద్ధులు ఈ ఎండలకు విల విల లాడిపోతున్నారు. ఒంటి పూట బడులు, అందులో పరీక్షలు నిర్వహించే సమయం కావడంతో బడులకు పోవడం తప్పని పరిస్థితిగా మారింది. తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యాల పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం ఆరు గంటల వరకు వడగాల్పులు ఉండటం, రాత్రి 9 గంటల తర్వాత కాస్త వేడి తగ్గుముఖం పడుతుండటం కూడా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. సహజంగా బయటి వాతావరణానికి సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో ఉండే వాతావరణానికి కొంత వ్యత్యాసం ఉంటుంది. గనుల్లో ఈ ఎండల్లో కార్మికులు పనిచేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. విధుల సమయాలను మార్చండి అంటూ పలు కార్మిక సంఘాలు గగ్గోలు పెడుతున్నాయి. పెరుగుతున్న ఎండలతో శీతల పానీయాలకు గిరాకీ పెరుగుతోంది.

అల్లాడుతున్న ప్రజలు

కరకగూడెం: రోజు రోజుకు ఎండలు మాడు పగలకొడుతున్నాయి. ప్రజలు ఇంటి నుంచి కాలు బయట పెట్టాలన్న భయాందోళన చెందుతున్నారు. ఎండ తీవ్రతతో కూలీలు, రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం ఏడు గంటల నుంచే ఎండ తీవ్రత పెరుగుతుండటంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు రావాలంటే జంకుతున్నారు. రోహిణి కార్తె రాకముందే ఎండలు దంచి కొటుతున్నాయి. ఇంకా మే నెలలో ఎండ తీవ్రత ఎలా ఉంటోందనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎండ తీవ్రతతో ప్రజలు శీతల పానీయాలకు మక్కువ చూపుతున్నారు. ఎండ తీవ్రతతో ప్రజలు కూలర్లు, ఏసీలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రజలే కాక మూగ జీవాలు కూడా ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడుతున్నాయి. 10 గంటలు సమయంలోపు పశువులు గుక్కెడు తాగునీరు కోసం చెరువుల వద్దకు వెళ్లి చెరువులో సేద తీరుతున్నాయి. ఏప్రిల్ నెలలో ఎండలు ఇలా ఉంటే రాను రాను పరిస్థితి ఏమిటని ప్రజలు భీతిళ్లుతున్నారు.

బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్న పీఏసీఎస్ ఛైర్మన్

కేటీఆర్ సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకున్న 'లక్కినేని'



బీఆర్ఎస్‌లో చేరుతున్న లక్కినేని సురేందర్‌రావు

టేకులపల్లి, ఏప్రిల్ 18: మండలంలోని బేతంపూడి వ్యవసాయ పరపతి సంఘం(పీఏసీఎస్) ఛైర్మన్ లక్కినేని సురేందర్‌రావు గురువారం బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకొన్నారు. ఈ మేరకు హైద్రాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ ఆధ్వర్యంలో గురువారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆయనకు బీఆర్ఎస్ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 2020లో జరిగిన పీఏసీఎస్ ఎన్నికల్లో లక్కినేని సురేందర్‌రావు బీఆర్ఎస్ పార్టీ నుంచి బేతంపూడి పీఏసీఎస్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఆయన కొంతకాలనికి 2023లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరాడు. 10రోజుల్లోనే బీజేపీ నుంచి జనసేనలో చేరి కొత్తగూడెం అసెంబ్లీకి జనసేనా అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు విశ్వప్రయత్రాలు చేశాడని, అందుకు ఎమ్మెల్యే కోరం కనకయ్య వర్గీయులు అడ్డుకొన్నట్టు సమాచారం. దీంతో తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కాగా అధినాయకత్వం బీఆర్ఎస్ పార్టీ జిల్లా కోఆర్డినేటర్‌గా తనను ఎంపిక చేసినట్టు లక్కినేని సురేందర్‌రావు తెలిపారు.

పట్టాభిషేక రామయ్యకు రథోత్సవం



రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, ఏప్రిల్ 18: భద్రాచలంలో పట్టాభిషిక్తుడైన శ్రీ సీతారామచంద్రస్వామి వారికి గురువారం రాత్రి రథోత్సవం నిర్వహించారు. రామాలయం నుంచి అందంగా అలంకరించిన రథంలో స్వామి వారిని ఆసీనులను చేసి రాజవీధి, తాతుగడి సెంటరు మీదుగా గోవిందరాజస్వామి వారి ఆలయంకు తీసుకొచ్చారు. అక్కడ భక్తుల దర్శనం అనంతరం స్వామి వారిని తిరిగి రామాలయంకు తీసుకెళ్లారు. ఇదిలా ఉండగా నేడు స్వామి వారికి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సదస్యం, మహదాశీర్వచనం నిర్వహించనున్నారు.

ముదురుతున్న ఆలయ రోడ్డు వివాదం



దీక్ష చేస్తున్న నిర్వాహకుడు కృష్ణమూర్తి గురుస్వామి

కొత్తగూడెం సాంస్కృతికం, ఏప్రిల్ 18: గతంలో సింగరేణి అధికారులు ఆలయాలకు భూములు కేటాయించి.. భక్తులను గౌరవిస్తే.. ప్రస్తుతం ఉన్న సింగరేణి అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని దేవాలయాలన్నా.. భక్తులన్న గౌరవం లేదని సింగరేణి అధికారులపై శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయ నిర్వాహకులు కృష్ణమూర్తి గురుస్వామి తీవ్రంగా మండిపడ్డారు. కొత్తగూడెంలో పేరు ప్రఖ్యాతలు కాంచిన శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయానికి వెళ్లే రోడ్డును కుదించుతూ ఇటీవల సింగరేణి అధికారులు ఆలయం ఎదుట గల ప్రాంతంలో క్వార్టర్స్ నిర్మాణాలు చేపట్టడంపై నిరసన వ్యక్తం చేస్తూ గురువారం అయ్యప్ప ఆలయం ఎదుట నిర్వాహకులు కృష్ణమూర్తి గురుస్వామి నిరవధిక దీక్షకు పూనుకున్నారు. 29 అడుగులు ఉన్న ఆలయానికి వెళ్లే రోడ్డును 22 అడుగులకు కుదించడంపై సింగరేణి అధికారుల తీరును తప్పు పట్టారు. ఆలయానికి వచ్చే వేలాదిమంది భక్తులకు అసౌకర్యం కలిగేలా సింగరేణి అధికారులు నిర్మాణాలు చేపట్టడం సరికాదన్నారు. కార్తీక మాసం మొదలుకొని నాలుగు నెలల వరకు అయ్యప్పస్వామి ఆలయానికి వచ్చే భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని, నిత్యాన్నదానాలు, భజనలతో ఆలయం సందడిగా ఉంటుందని, అలా వచ్చే భక్తుల రాకపోకలకు ఇబ్బంది కలిగేలా రోడ్డును కుదిస్తూ నిర్మాణాలు చేపట్టడం భక్తుల మనోభావం దెబ్బతీయమే అని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఏఐటీయూసీలో భారీ చేరికలు



మణుగూరుటౌన్, ఏప్రిల్ 18: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయుసీలోకి ప్రాతినిధ్య సంఘంతో పాటు ఇతర యూనియన్ నుంచి భారీ సంఖ్యలో చేరుతున్నారు. ఇందులో భాగంగా గురువారం ఏఐటీయుసీలో చేరిన కార్మికులకు ఏరియా బ్రాంచి సెక్రటరీ వై.రాం గోపాల్ యూనియన్ కండువ కప్పి సాదరంగా ఆహ్వానించారు. యూనియన్‌లో చేరిన వారిలో కుమారస్వామి, ఆశీర్వాదం, జనార్ధన్, రాజేష్, రజనీకాంత్, నవీన్‌కుమార్, సాంబయ్య, విజయ్‌కుమార్, రవికుమార్, స్వామి ఉన్నారు.

కంప్యూటర్లు అందచేసిన టీఎన్ఆర్ ట్రస్ట్



కంప్యూటర్లు అందజేస్తున్న దృశ్యం

పాల్వంచ రూరల్, ఏప్రిల్ 18: టీఎన్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం పాల్వంచ మండలం కేపీ జగన్నాధపురం జడ్పీ హైస్కూల్‌కు రూ.3,50,000 విలువగల ఆరు కంప్యూటర్లను హెచ్ఎం శ్రీరామూర్తికి అందచేశారు. ఈ సందర్భంగా టీఎన్ఆర్ ట్రస్ట్‌చైర్మన్ తాండ్ర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కంప్యూటర్ విద్య రానున్న రోజుల్లో చాలా అవసరమని, చదువు మాత్రమే మనిషిని ఉన్నత స్థానాల్లో నిలబెడుతుందని, ఇష్టపడి చదవాలని కోరారు. అనంతరం టీఎన్ఆర్ ట్రస్ట్‌చైర్మన్‌ను గ్రామస్తులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్‌ఆర్గనైజర్ నరాటి ప్రసాద్, గ్రామ పెద్దలు కొండం వెంకన్న, పుల్లయ్య, వెంకటనారాయణ, రవి తదితరులు పాల్గొన్నారు.

'శివ సంకల్పం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

భద్రాచలం, ఏప్రిల్ 18: శివ సంకల్పం పుస్తకాన్ని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు గురువారం ఆవిష్కరించారు. రచయిత వెంగలరావు ఈ పుస్తకాన్ని రచించారు. సకల సమస్యలకు పరిష్కారం శివ సంకల్పం పేరుతో పుస్తకాన్ని రచించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత వెంగలరావు, సీనియర్ జర్నలిస్టు పరిటాల వెంకట సత్యనారాయణ, వనం నందా పాల్గొన్నారు.

డిపో సమస్యపై తుమ్మలకు వినతి



తుమ్మలకు వినతిపత్రం సమర్పిస్తున్న టీడీపీ నాయకులు

ఇల్లెందు టౌన్, ఏప్రిల్ 18: ఇల్లెందు బస్సు డిపోలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు, ఎమ్మెల్యే కోరం కనకయ్యకు ఇల్లెందు తెలుగుదేశం పార్టీ బృందం గురువారం వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఇల్లెందు నియోజకవర్గ ఇంచార్జీ ముద్రగడ వంశీ మాట్లాడుతూ గత ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలు హడావుడిగా బస్సు డిపో ఏర్పాటు చేయడం జరిగిందని కానీ అందులో సరైన సదుపాయాలు లేక ప్రజలు, డ్రైవర్లు, కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. డ్రైవర్లు భోజనం చేయడానికి సరైన భోజనశాల కానీ విశ్రాంతి తీసుకోవడానికి గదులు కానీ లేక ఇబ్బంది పడుతున్నారని, ఇల్లెందుకు కేటాయించిన బస్సులు కూడా అన్ని పాతవేనని కొత్తబస్సులు ఏర్పాటు చేయాలని, బస్సు డిపోలో చుట్టుపక్క వైన్స్‌షాపులు ఉండటం, మందు బాబులకు అడ్డాగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. డిపో చుట్టు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వారిని అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. గతంలో బస్టాండ్ ప్లాట్ ఫారం ఏర్పాటు చేయాలని బస్టాండ్‌లో నాట్లు వేయడం, సంతకాల సేకరణ చేయడం జరిగిందన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్ ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చాంద్‌వత్ రమేష్‌బాబు, మట్టల రత్నాకర్, టీఎన్ఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షులు దాసరి గోపాలకృష్ణ, ముక్కు శ్రీవెద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 18: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలో గురువారం సాయంత్రం జరిగింది. అశ్వారావుపేటలోని మద్దిరామమ్మగుడి సెంటర్‌లో మెకానిక్ షెడ్ నిర్వహించే లోకాల రాము(20), అతని స్నేహితుడు జి.భాను ద్విచక్ర వాహనంపై వినాయకపురం వైపు నుంచి అశ్వారావుపేటకు వస్తున్నారు. ఇదే సమయంలో అశ్వారావుపేట వైపు నుంచి కుక్కునూరు వైపుకు వెళుతున్న కారు భద్రాచలం రోడ్‌లోని నాలుగో కిలోమీటరు సమీపంలో ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొంది. ప్రమాదం అనంతరం కారు రోడ్డు కిందకు దూసుకెళ్లింది. ప్రమాదంలో రాము అక్కడిక్కడే మృతిచెందగా భానుకు గాయాలు అయ్యాయి. క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురికి తరలించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 18: అనారోగ్య సమస్యలతో బాధపడుతూ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధుడు మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ నాగేశ్వరావు తెలిపిన వివరాల ప్రకారం అశ్వారావుపేటలోని కోతమిషన్ బజారుకు చెందిన బమ్మిడి సాంబయ్య(62) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సాంబయ్యకు కొంతకాలం క్రితం కడుపులో కణితి ఏర్పడగా చికిత్స పొందుతున్నాడు. అయినా నొప్పి తీవ్రంగా వస్తుండటంతో నొప్పిని భరించలేక బుధవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అశ్వారావుపేటలో చికిత్స అనంతరం కొత్తగూడెం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భద్రాద్రిలో ఐదో ఏసీబీ దాడి

లంచం తీసుకుంటూ పట్టుబడుతున్న అధికారులు

భద్రాచలం, ఏప్రిల్ 18: భద్రాచలంలో గురువారం ఏసీబీ అధికారులకు చట్టాన్ని రక్షించాల్సిన పోలీసులే లంచావతారం ఎత్తి పట్టుబడటం సంచలనంగా మారింది. ఇప్పటి వరకు భద్రాచలంలో నాలుగు సార్లు ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి వివిధ శాఖల అధికారులు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. తాజాగా ఐదోసారి గురువారం జరిపిన ఏసీబీ దాడుల్లో భద్రాచలం పోలీసు స్టేషన్‌లో పని చేసే ఎస్సై ములగొండ్ల. శ్రీనివాస్, కానిస్టేబుల్ శంకరశెట్టి శంకర్‌తో పాటు సీసీ కెమెరా టెక్నీషియన్‌గా పని చేసే ప్రయివేటు వ్యక్తి కర్నాటి నవీన్ కుమార్ దొంగతనం కేసులో పట్టుబడిన వారి నుంచి రూ.30 వేలు లంచం డిమాండ్ చేసి రూ.20 వేలు తీసుకుంటుండగా పట్టుబడ్డారు. అంతకు ముందు 2020 మార్చి 5న భద్రాచలం ఎస్టీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్ రూ.1.50 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడగా ఆయనను లంచం తీసుకోమని ప్రోత్సహించిన ఎస్టీవో ఎస్కే సైదులుతో పాటు ఇరువురిని ఏసీబీ డీఎస్పీ మధుసూదన్ అరెస్టు చేశారు. అలాగే 2019 నవంబరు 28న భద్రాచలంలోని తహసీల్దారు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కుంజా శ్రీనివాసరావు రూ.వెయ్యి లంచం తీసుకుంటూ ఏసీబీ వరంగల్, ఖమ్మం ఇన్‌చార్జి డీఎస్పీ మధుసూదన్ పట్టుకున్నారు. అంతకు ముందు భద్రాచలంలోని ఐటీడీఏ రోడ్డులో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిష్టార్ అవినీతికి పాల్పడుతుండగా ఏసీబీ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. 2018 ఏప్రిల్ 30న ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగు విభాగంలో ఈఈ ఎం.శంకర్, ఏఈ సత్యనారాయణలను రూ.50 వేలు తీసుకుంటుండగా వలపన్ని పట్టుకున్నారు. ఇలా ఏసీబీ అధికారుల దాడుల్లో అధికారులు పట్టుబడుతుండటం సంచలనంగా మారింది.

తాగునీటి బోరుకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ములకలపల్లి, ఏప్రిల్ 18: మండలంలోని మూకమామిడి గ్రామపంచాయతీ శివారు గ్రామం సాయిరాంపురంలో గత వారం నుంచి తాగునీరు లేక ప్రజలు అవస్థలకు గురవుతున్నారు. 'సాయిపురంలో నీటి ఎద్దడి ' అనే వార్త కథనం గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు హుటాహుటిన బోరుకు మరమ్మతులు నిర్వహించి నీటి పంపులను ఏర్పాటు చేశారు.

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

కొత్తగూడెం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయం సమీపంలోని గుట్టల్లో బుధవారం రాత్రి మంటలు ఎగిసిపడ్డాయి. కొత్తగూడెం నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ద్విచక్రవాహనదారులు అప్రమత్తంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పినట్లైంది. వేసవికాలంలో జీఎం కార్యాలయ సమీపంలోని గుట్టల్లోని చెట్లకు ఆకులు రాలి ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో ఈ మంటలు ఎగిసి టపడ్డాయి. అగ్నిమాపకశకటానికి సమాచారం అందించినప్పటికి సంబంధిత అధికారులు సకాలంలో రాకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏదిఏమైనప్పటికీ రాత్రి సమయంలో మంటలు ఎగిసిపడటం వల్ల ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. సమీపంలోని జీఎం కార్యాలయం వైపు మంటలు వ్యాపించి ఉంటే ఎలా ఉంటుందోనని సింగరేణీయులు ఆందోళన వ్యక్తం చేశారు.

వడదెబ్బ బాధితులకు ప్రత్యేక చికిత్సలు అందించాలి

జూలూరుపాడు, ఏప్రిల్ 18: వడదెబ్బ బారిన పడిన వారికి ప్రభుత్వ ఆసుపత్రి, ఆరోగ్య ఉపకేంద్రాల్లో ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేసి చికిత్సలు అందించాలని సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు కోరారు. గురువారం జూలూరుపాడులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అన్నిరకాల మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను గ్రామాల్లోని ప్రజలకు పంపిణీ చేయాలని తెలిపారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో అవగాహన సదస్సులను ఏర్పాటు చేసి వడదెబ్బబారిన పడకుండ ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించాలని కోరారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు అలవెన్సుల పంపిణీ

లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 18: లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్‌కాలని పంచాయతీలోని ఇందిరానగర్‌కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు అనుబంధంగా ఉన్న ప్రత్యేక అవసరాల పిల్లల కేంద్రం భవితలో గురువారం ఫిజియోథెరపీ శిబిరాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ కృత్రిమ అవయవాల తయారీ కార్పోరేషన్ ద్వారా ప్రత్యేక అవసరాల పిల్లలకు మంజూరైన అలవెన్సులను జిల్లా విద్యాశాఖ కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ సైదులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఫిజియోథెరపీ వల్ల జరిగే ప్రయోజనం గురించి పిల్లలతల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎం. జ్యోతిరాణి, ఫిజియోథెరపిస్ట్ రూతమ్మ, ఐఆర్‌పీ టీచర్లు జానకి, స్వప్న, కేర్‌టేకర్ రాధిక, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిన్నారులకు పోషకాహారం పంపిణీ

అశ్వాపురం, ఏప్రిల్ 18: ఇటుకబట్టీలలో పనిచేసే కూలీల చిన్నారులకు గురువారం మండల పరిధిలోని బీజీ కొత్తూరు అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 3నుంచి 6సంవత్సరాల వయస్సు చిన్నారులకు బియ్యం, నూనె,7 నెలల చిన్నారుల నుంచి 3 సంవత్సరాల వయస్సువారికి కోడిగుడ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ టీచరు శైలజ పాల్గొన్నారు.

నేటి సీఎం సభకు తరలిరావాలి

దుమ్ముగూడెం ఏప్రిల్ 18: మహబూబాద్‌లో శుక్రవారం జరగనున్న భారీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వీరమాచినేని వినీల్ గురువారం పిలుపునిచ్చారు. ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ నామినేషన్ అనంతరం సాయంత్రం నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనున్నాని ఆయన తెలిపారు. సభను జయప్రదం చేయాలని కోరారు. మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు తరలిరావాలని కోరారు.

అశ్రమ పాఠశాలల్లో నేత్ర వైద్య శిబిరాలు

మణుగూరుటౌన్, ఏప్రిల్ 18: మణుగూరు సబ్ డివిజన్‌లోని ఆశ్రమ పాఠశాలల్లో 8వ తేది నుంచి నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు నేత్ర వైద్య శిబిరాల్లో మొత్తంగా 1470 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 35 మంది విద్యార్థులకు కళ్ల జోళ్లు అవసరమని గుర్తించగా మరో 5 మంది విద్యార్థుల కళ్లకు మెరుగైన చికిత్స నిమిత్తం రిఫర్ చేయడం జరిగింది. సబ్ డివిజన్‌లోని అశ్వాపురం, మణుగూరు, పినపాక, కరకగూడెం మండలాల్లోని సోషల్ వెల్ఫేర్, బీజీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, మైనారిటీ వెల్ఫేర్, కేజీబీవీ ఆశ్రమ పాఠశాలల్లో ఈ వైద్య శిబిరాలను నిర్వహించారు. శిబిరాలు విజయంతంగా కొనసాగుతున్నాయి. శిబిరాల్లో డాక్టర్ గోపిలాల్, నేత్ర వైద్య సహాయాధికారి జి.సంజీవరావు, ఆర్‌బీఎస్‌కే వైద్య సిబ్బంది, హాస్టల్ వార్డెన్లు కౌసల్య, శ్రీవిద్య, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో పనిచేయని శుద్ధజల ప్లాంట్



జూలూరుపాడు, ఏప్రిల్ 18: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు, ప్రజలకు సురక్షితమైన నీటిని అందించాలని సంకల్పించి గత కొన్నేళ్ల క్రితం ప్రభుత్వం జూలూరుపాడులోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుద్ధజల ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. కాగా ఇది పని చేయకపోవడంతో నిరుపయోగంగా మారింది. నిర్వహణ విషయంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. గతకొన్ని నెలలుగా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో ఆసుపత్రిలో తాగునీరు అందుబాటులో లేకపోవడంతో రోగులు, ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఆసుపత్రికి వచ్చిన వారు దాహార్తిని తీర్చుకోవడానికి నీటికోసం బయటకు వెళ్లాల్సి వస్తోంది. శుద్ధజల ప్లాంట్ ఉన్నప్పటికీ తాగునీటిని అందుబాటులో ఉంచకపోవడం పై ప్రజలు వైద్యసిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆసుపత్రికి వచ్చే రోగులకు, ప్రజలకు తాగునీరు అందించేందుకు లక్షలాది రూపాయలతో మినరల్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేసినప్పటికీ వైద్యసిబ్బంది నీటిని అందుబాటులో ఉంచకపోవడం తగదని ప్రజలు అంటున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైన వైద్యసిబ్బంది ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకుని వచ్చి తాగునీటిని అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పోలయ్య కుటుంబానికి..

ఆర్థిక సాయం

అశ్వారావుపేట టౌన్, ఏప్రిల్ 18: ఇటీవల పట్టణంలోని మెరుపు కాలనీలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన పోలయ్య కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు అభిమానుల సంఘం, జలగం యువసేన బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసింది. ముందుగా జలగం యువసేన అధ్యక్షుడు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో జలగం జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అభిమానులకు తినిపించారు, ఈ కార్యక్రమంలో మణి, గౌరీ, నాయుడు శ్రీను, పటేల్ శ్రీను, మోట్బా వెంకటేష్, తాండ్ర సాత్విక్, భరత్, భార్గవ్, రాం తేజ, సురేష్ పాల్గొన్నారు, .